క్లుప్తంగా

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి

జగ్గంపేట: విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఒమ్మి రఘురాం సూచించారు. జగ్గంపేట ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇ.చంద్రనాయుడు, అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

భూముల రీసర్వే ప్రారంభం

తొండంగి: జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా పైడికొండ పంచాయతీ ఆనూరు గ్రామంలో శుక్రవారం భూముల రీసర్వే చేశారు. గ్రామ సర్పంచ్ నర్సే దుర్గ, వైఎస్సార్ సీపీ నాయకుడు నర్సే తాతయ్య డ్రోన్ సాయంతో చేసే భూముల రీ సర్వేను ప్రారంభించారు. వారం రోజుల పాటు పరిసర ప్రాంత భూములను సర్వే చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు కె.రాజ్యలక్ష్మి, కె.శ్రీనివాస్ వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

ఏలేశ్వరం: స్థానిక 18వ వార్డుకు చెందిన తూమురొతు సత్తిబాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతనికి వైఎస్సార్ బీమా పథకంలో రూ.లక్ష మంజూరు కాగా ఆ చెక్కును శుక్రవారం మున్సిపల్ కౌన్సిలర్ యండగండి నాగబాబు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. వైఎస్సార్ బీమా పథకంతో పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని నాగబాబు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు గొడత రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

గండేపల్లి: విద్యార్థులు పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని ఆదిత్య విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగం విద్యార్థులకు శుక్రవారం పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, టెక్నికల్ పజిల్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీన్ రవికుమార్, ఈఈఈ విభాగాధిపతి మనోజ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాల వెల్లువపై అవగాహన

తుని రూరల్: రైతులు వైఎస్సార్ పాల వెల్లువ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారి వి.శ్రీధర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అధ్యక్షతన శుక్రవారం సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ స్థాయి అధికారులకు వైఎస్సార్ పాల వెల్లువపై అవగాహన సదస్సు నిర్వహించారు. తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో 79 గ్రామాలకు కేంద్రంగా తుని మండలం రేఖవానిపాలెంలో బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్టు ఏహెచ్ఓ శ్రీధర్ తెలిపారు. వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, ఎంపీడీఓ ఎస్.సుబ్రహ్మణ్య శర్మ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభం

కిర్లంపూడి: గ్రామంలో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులను శుక్రవారం పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఏఈ షేక్ వల్లీ ప్రారంభించారు. ఈ పోలీస్ స్టేషన్ పనులకు గత నెలలో ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు భూమి పూజ చేసిన విషయం తెలిసిందే. కాగా పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని షేక్ వల్లీ తెలిపారు. జగ్గంపేట సీఐ సూర్య అప్పారావు, ఎస్సై బి.తిరుపతిరావు, కిర్లంపూడి సొసైటీ చైర్మన్ చదలవాడ బాబీ, కాంట్రాక్టర్ నల్లా రాజశేఖర్, రాపేటి ప్రసాద్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో జాప్యం తగదు

జగ్గంపేట: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ శుక్రవారం జగ్గంపేటలో జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. గత ఐదు రోజులుగా ధాన్యం లోడుతో జాతీయ రహదారిపై కాటా వద్ద 50 లారీలు నిలిచి ఉన్నాయన్నారు. ధాన్యం కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం తగదన్నారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

శంఖవరం: జనసేన పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు మేడిశెట్టి సూర్యకిరణ్ పిలుపు నిచ్చారు. మండలంలోని సీతంపేట యాదవ కమ్యూనిటీ హాలులో శుక్రవారం జనసేన కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం జనసేన యువశక్తి పోస్టర్‌ను విడుదల చేశారు.

జీవో రద్దు చేయాలంటూ ఆందోళన

ఏలేశ్వరం: రాష్ట్రంలోని రహదారులపై బహిరంగ సభలు, రోడ్ షోలను నిషేధిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో వెంటనే రద్దు చేయాలని కోరుతూ పట్టణంలో శుక్రవారం ఆందోళన చేశారు. సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో జీవో ప్రతులను దహనం చేశారు. ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా మారిన జీవోను వెంటనే రద్దు చేయాలని కోరారు. పార్టీ నాయకులు గణేష్, కందుల ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

- రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- జి.మునలయ్యపేటలో గడపగడపకూ..


గొల్ల ముసలయ్యపేటలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి దాడిశెటి రాజా

తొండంగి: రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని గొల్ల ముసలయ్యపేటలో శుక్రవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత మూడేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. గ్రామస్తులు విద్యుత్ లైన్లు, రోడ్లు, డ్రైన్లు, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మించి సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అంగుళూరి అరుణ్‌కుమార్, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ మత్స్యకార విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, పార్టీ నాయకులు గాబు రాజు, దూలం బాబూరావు, దూలం నూకరాజు, కొయ్యా మురళీ, ఆరుమిల్లి ఏసుబాబు, అంబుజాలపు గంగరాజు, నేమాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీవోల భవనానికి స్థలం కేటాయిస్తాం

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు


ఇర్రిపాకలో ఎన్జీవోల క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: గ్రామంలో ఏపీ ఎన్జీవోలు నూతన భవనం నిర్మించుకోవడానికి స్థలం కేటాయిస్తామని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తెలిపారు. ఏపీ ఎన్జీవో సంఘ నేతలు శుక్రవారం మండలంలోని ఇర్రిపాకలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబును కలిశారు. ఎన్జీవోల నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఏపీ ఎన్జీవోల సంఘం కోరిక మేరకు జగ్గంపేటలో నూతన భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఇప్పటికే రెవెన్యూ అధికారులకు సూచించినట్టు తెలిపారు. జగ్గంపేట గ్రామ ఉపసర్పంచ్ బండారు రాజా, ఏపీ ఎన్జీవో జగ్గంపేట యూనిట్ అధ్యక్షుడు వీవీవీ కృష్ణ, కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్రాంతి క్రీడా సంబరాలు


గండేపల్లిలో కబడ్డీ పోటీల విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు


జగ్గంపేటలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

గండేపల్లి: సంక్రాంతి క్రీడా సంబరాల్లో భాగంగా శుక్రవారం గండేపల్లి హైస్కూల్ విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించినట్టు స్థానిక ఎస్సై వై.గణేష్ కుమార్ తెలిపారు. పాఠశాలలో భోగి మంటలు వేసి విద్యార్థులకు సంక్రాంతి ప్రాముఖ్యతను వివరించారు. రాత్రికి కబడ్డీ పోటీలు నిర్వహించారు. తుని టీమ్ విన్నర్‌గా, సామర్లకోట టీమ్ రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు బహుమతులు అందజేశారు.

జగ్గంపేట: గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సాంప్రదాయ క్రీడా సంబరాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన జట్ల మధ్య శుక్రవారం వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి.

నేడు ముగింపు వేడుకలు

తుని: స్థానిక రాజా కళాశాల మైదానంలో శనివారం సంక్రాంతి సంబరాల ముగింపు వేడుకలు నిర్వహించనున్నట్టు తుని పట్టణ సీఐ నాగ దుర్గారావు శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే వేడుకల్లో రాష్ట్ర రోడ్లు,భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా, జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు.

అర్హులందరికీ పింఛన్లు


జగ్గంపేటలో లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న ఒమ్మి రఘురాం


వేలంకలో లబ్ధిదారులకు నూతన పింఛన్లు అందజేస్తున్న దోమాల గంగాధర్

జగ్గంపేట: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. గ్రామంలో నూతనంగా మంజూరైన లబ్ధిదారులకు శుక్రవారం గ్రామ ఉపసర్పంచ్ బండారు రాజాతో కలిసి ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. సీతానగరం గ్రామంలో వైఎస్సార్ సీపీ నేత కరుటూరి వీర్రాజు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. నియోజకవర్గంలో కొత్తగా 1528 మందికి పింఛన్లు మంజూరైనట్టు ఒమ్మి రఘురాం తెలిపారు.

కిర్లంపూడి: మండలంలోని వేలంకలో కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దోమాల గంగాధర్ పింఛన్లు పంపిణీ చేశారు. సింహాద్రిపురంలో ఎంపీటీసీ నంది వెంకన్న కొత్త పింఛన్లు పంపిణీ చేశారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం

మాజీ మంత్రి తోట వెంకట నరసింహం

అన్నవరం: ఎన్నికలు ఎప్పుడు జరిగినా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని మాజీ మంత్రి తోట వెంకట నరసింహం అన్నారు.శుక్రవారం ఆయన కుటుంబ సమేతంగా రత్నగిరిపై సత్యదేవుని వ్రతమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నవరంలో విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో లబ్ధిదారుల ఇంటికే నేరుగా సంక్షమ పథకాలు అందుతున్నాయన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో ప్రజలు రెండు దశాబ్దాలుగా టీడీపీని మర్చిపోయారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లోనూ అక్కడ టీడీపీ గెలిచే పరిస్థితి లేదన్నారు. రాష్ట ముఖ్యమంత్రి తనకు ఏ బాధ్యత అప్పగించినా శిరసా వహిస్తానని మాజీ మంత్రి తోట తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు అత్తలూరి సాయిబాబా, డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు మూర్తి, వెలిశెట్టి గిరి, దేవస్థానం రిసెప్షన్ సీనియర్ అసిస్టెంట్ పోల్నాటి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

గోకవరం: స్థానిక ఎంఆర్‌సీలో శుక్రవారం యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎన్నికల అధికారి ఎండీ షరీఫ్, పర్యావేక్షణ అధికారి ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక జరిగింది. సంఘ మండలాధ్యక్షుడిగా ఎస్.అనిల్ కుమార్, గౌరవాధ్యక్షుడిగా కె.నాగభూషణం, సహాధ్యక్షులుగా ఎస్.కుమార్, పీఎస్‌వీఆర్ఎల్ నరస, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాస్, కోశాధికారిగా పీవీవీఎస్ఆర్ త్రిమూర్తులు, ఆడిటర్‌గా ఎం.రత్నంతో పాటు 10 మంది కార్యదర్శులుగా ఎన్నికయ్యారు.

విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కిషోర్‌బాబు

ప్రత్తిపాడు: విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా కళాశాల యాజమాన్యాలే చర్యలు తీసుకోవాలని ప్రత్తిపాడు సీఐ కె.కిషోర్ బాబు సూచించారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో కళాశాల యాజమాన్యాలతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈవ్ టీజింగ్, యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్ నిరోధంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ కిషోర్‌బాబు మాట్లాడుతూ కళాశాలల్లో విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా చూడాలన్నారు. యాంటీ ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. మానసికంగా ఇబ్బందులు పడుతున్న విద్యార్థులను గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, యాజమాన్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దు

ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగించవద్దంటూ అన్నవరం, ఏలేశ్వరం పోలీస్ స్టేషన్ల పరిధిలోని హిజ్రా (ట్రాన్స్‌జెండర్స్)లకు ప్రత్తిపాడు సీఐ కె. కిషోర్‌బాబు సూచించారు. ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన హిజ్రాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రయాణికులు, ప్రజలను వేధించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర, చండీహోమాలు


ఎస్.అన్నవరంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

అన్నవరం: పౌర్ణమిని పురస్కరించుకుని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం ప్రత్యంగిర, చండీ హోమాలు నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి చండీ, ప్రత్యంగిర హోమాలు ప్రారంభించారు. మధ్యాహ్నం 12.15 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. 115 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు. దీంతో వనదుర్గ అమ్మవారి మండపం భక్తులతో కిటకిటలాడింది.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు.

వేంకటేశ్వరస్వామికి సుదర్శన హోమం

తుని రూరల్: పౌర్ణమిని పురస్కరించుకుని ఎస్.అన్నవరంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం సుదర్శన నారసింహ హోమం నిర్వహించారు. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమం, పూర్ణాహుతి జరిపించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించినట్టు దేవస్థానం చైర్మన్ కోలా భీమేశ్వరరావు తెలిపారు.

తలుపులమ్మతల్లికి మహాచండీ హోమం

తుని రూరల్: పౌర్ణమి సందర్భంగా లోవ దేవస్థానంలో కొలువైన తలుపులమ్మ అమ్మవారికి శుక్రవారం మహా చండీ హోమం నిర్వహించారు. దేవస్థానంలోని పంచలోహ విగ్రహాల ప్రాంగణంలో వేదండితులు రాణి సుబ్రహ్మణ్యశర్మ, పురుషోత్తమశర్మ, ధూళిపాళ సాయి శ్రీనివాసశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా హోమం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆరుతడి పంటలతో లాభాలు

తుని రూరల్: రబీలో ఆరుతడిగా మిశ్రమ పంటలను సాగు చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి బి.అశోక్ కుమార్ అన్నారు. వి.కొత్తూరు రైతు భరోసా కేంద్రం పరిధిలో శుక్రవారం పొలంబడి రైతు క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఖరీఫ్ కోతలు పూర్తయినందున రబీసాగుకు రైతులు సిద్ధం కావాలన్నారు. సాగునీటి వసతులు లేనందున ఆరుతడిగా సాగయ్యే అపరాలు, కూరగాయల పంటలు పండించాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్నిరకాల ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దుంగల నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు కిల్లి సన్యాసిరావు, ఏఈఓ పి.జగ్గప్పారావు, ఎంపీఈఓ బంగార్రాజు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్‌గా ప్రసాద్


మంత్రి దాడిశెట్టి రాజాకు మొక్కను ఇచ్చి కృతజ్ఞతలు తెలుపుతున్న లంక ప్రసాద్

కోటనందూరు: రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్‌గా మండలంలోని కాకరాపల్లికి చెందిన లంక ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం అగ్రికల్చర్ కార్పొరేషన్ నుంచి ఆయనకు ఉత్తర్వులు అందాయి. లంక ప్రసాద్ ఇప్పటికే వ్యవసాయ సలహా మండలి కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన తుని మండలం ఎస్. అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి దాడిశెట్టి రాజాను మర్యాద పూర్వకంగా కలిశారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన మంత్రి దాడిశెట్టి రాజాకు, తనకు అండగా ఉండి సహకరించిన ఎంపీపీ లగుడు శ్రీనివాసు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో రైతుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నాని చెప్పారు. రాష్ట్రస్థాయి పదవి వరించిన లంక ప్రసాద్‌కు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

తుని రూరల్: పశ్చిమ గోదావరి జిల్లా నారాయణపేట (గరగపర్రు) గ్రామానికి చెందిన బొబ్బిలి సత్యనారాయణ (35) తుని మండలంలో ఎస్ఎస్ వెంకటాపురం శివారు జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై ఎ.బాలాజీ శుక్రవారం తెలిపారు. ఈ నెల 4న జరిగిన ప్రమాద ఘటన వివరాలను శుక్రవారం ఆయన తెలిపారు. రౌతులపూడి మండలం ఎస్ఎన్ పట్నంలో నివాసం ఉంటున్న తన అత్తింటి నుంచి తుని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భార్యకు భోజనం తీసుకుని మోటార్ సైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ సత్యనారాయణను ఢీకొట్టింది. ఈ సంఘటనలో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


సిరిపురం గీతాశ్రమంలో ప్రసంగిస్తున్న సూర్యానందస్వామి

ఏలేశ్వరం: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని లక్ష్మీనర్సాపురం సత్యసాయి ఆశ్రమ పీఠాధిపతి సూర్యానందస్వామి అన్నారు. సిరిపురంలోని శ్రీచిద్గగనందా గీతాశ్రమంలో శుక్రవారం దయానందా భారతీస్వామి ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యానందస్వామి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తి భావం అలవర్చుకోవాలన్నారు. ఆధ్యాత్మికతతో ఒత్తిడిని జయించవచ్చన్నారు. ప్రపంచ దేశాల్లో హిందూ మతానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశ్రమ కార్యదర్శి నడిశెట్టి తిరుపతిరావు, యల్లపు సూర్యనారాయణ, ముక్కు సుబ్రమణ్యం, పొలమూరి పెదకాపు, మజ్జూరి వెంకటలక్ష్మి, అల్లం సీత, అల్లం గంగ తదితరులు పాల్గొన్నారు.

హరిదాసుకు సన్మానం


లింగంపర్తిలో హరిదాసు దుర్గారావును సన్మానిస్తున్న సుబ్బారావు, భక్తులు

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తిలో శుక్రవారం హరిదాసును ఘనంగా సన్మానించారు. గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా సభ్యుడు ఆలమూరి సుబ్బారావు ఆధ్వర్యంలో హరిదాసు నీలాల దుర్గారావును పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాటూరి సూరిబాబు, రత్నమాల, పాటంశెట్టి కుమారి, అడపా వీరభద్రరావు, వరుపుల సూరిబాబు, పిల్లా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇన్నర్ వీల్ క్లబ్ సేవలు అభినందనీయం

తుని: సామాజిక సేవా కార్యక్రమాల్లో తుని ఇన్నర్ వీల్ క్లబ్ జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉందని ఆ క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ పాలచర్ల సీతాదేవి అన్నారు. శుక్రవారం క్లబ్ తుని శాఖ అధ్యక్షురాలు వి.దేవి ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతీయ రహదారి వెలంకొత్తూరు సెంటర్లో ఏర్పాటు చేసిన స్వాగతం బోర్డు, అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో నిర్మించిన షెడ్డు, తుని బ్యాంక్ కాలనీ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు లంచ్ బాక్సులు, మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విన్నర్‌వీల్ క్లబ్ కార్యదర్శి బండారు రమాదేవి, కె.వరలక్ష్మి, మాధవి, రాదా జ్యోతి, మానస, ఉమా, శిరీష, సావిత్రి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు

తుని: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని స్థానిక పాత బజారు వీధిలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం అన్న సమారాధన నిర్వహించారు. తొలుత ఆలయ పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అనంతరం పలురకాల వంటకాలతో అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. దేవస్థానం చైర్మన్ అన్నవరం శ్రీను, ఈఓ పి.విశ్వనాథరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ పొమర్తి మహేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కిర్లంపూడి: గ్రామ శివారు వనదుర్గమ్మ, జగపతినగరం అభయ దుర్గమ్మ ఆలయాల వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు.

ఉప్పుచెరువు ఆయకట్టుకు నీరు విడుదల

తొండంగి: మండలంలోని కోదాడ ఉప్పు చెరువు ఆయకట్టుకు శుక్రవారం నీటిని విడుదల చేశారు. ఈ ఏడాది పంపా ఆయకట్టుతో పాటు పల్లపు ప్రాంతమైన పీబీసీ పరిధిలో దాదాపు వెయ్యి ఎకరాలకు రబీలో సాగునీటి విడుదలకు రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా కృషి చేశారు. ఇప్పటికే పంపా ఆయకట్టుకు అధికారులు నీటిని విడుదల చేశారు. కాగా శుక్రవారం కోదాడ ఉప్పు చెరువు ఆయకట్టు పరిధిలో రబీ సాగుకు సర్పంచ్ బుర్తి రత్నకుమారి, వైఎస్సార్ సీపీ నాయకుడు బుర్తి నాని నీటిని విడుదల చేశారు. ఈ ఏడాది రబీకి పూర్తిస్థాయిలో నీరు అందించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్య డ్రైవ్

గోకవరం: గ్రామంలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లు, డ్రైన్లను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, తోలేటి ప్రసాద్ పనులను పర్యవేక్షించారు.

భవిత కేంద్రం పరిశీలన

రౌతులపూడి: దివ్యాంగులు స్థానిక భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ఎస్వీ నాయుడు సూచించారు. స్థానిక భవితకేంద్రంలో దివాంగులకు అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఫిజియోథెరపిస్టు సోమేశ్వరరావు దివ్యాంగులకు వైద్య పరీక్షలు, ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఎంఈఓ వెంట ఐఈఆర్టీ శ్రీనివాసు, సీఆర్పీ స్వర్ణలత ఉన్నారు.

పట్టణంలో డ్రైడే ఫ్రైడే

ఏలేశ్వరం: పట్టణంలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రై డే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. స్థానిక 14వ వార్డులో మున్సిపల్ కౌన్సిలర్ మూది నారాయణస్వామి, సీహెచ్‌సీ చైర్మన్ జువ్వన వీర్రాజు ఆధ్వర్యంలో రోడ్లు, డ్రైన్లు శుభ్రం చేశారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. పలు ప్రాంతాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. అనంతరం డ్రైన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. పప్పల సింహాద్రి, గోర్స శ్రీను పాల్గొన్నారు.

నరేంద్రగిరిపై శ్రమదానం

ప్రత్తిపాడు: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం ప్రత్తిపాడు జాతీయ రహదారిపై ఉన్న నరేంద్రగిరిని శ్రమదానంతో శుభ్రం చేశారు. శ్రీరామ ప్రభాత శాఖ స్వయం సేవకులు నరేంద్రగిరి మెట్ల మార్గం, స్వామి విగ్రహం వద్ద పెరిగిపోయిన పిచ్చిమొక్కలు, చెత్తా చెదారం తొలగించారు. నరేంద్రగిరిని శుభ్రం చేసే అక్కడకు వెళ్లే మార్గాని శుభ్ర పరిచారు. పలువురు స్వయం సేవకులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

గండేపల్లి: జాతీయ రహదారిపై మండలంలోని నీలాద్రిరావుపేట వద్ద శుక్రవారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఎస్‌హెచ్‌ఏఐ సిబ్బంది, స్థానికుల కథనం ప్రకారం జార్ఖండ్‌కు చెందిన ట్రాలీ చెన్నై నుంచి ఒడిశాకు ఐరన్ లోడుతో వెళుతోంది. మండలంలోని నీలాద్రిరావుపేట ఆదిత్య ఆస్పత్రికి ఎదురుగా వచ్చేసరికి స్కూటీపై వెళుతున్న వ్యక్తి హఠాత్తుగా రోడ్డుపైకి రావడంతో అతడిని తప్పించే ప్రయత్నంలో ట్రాలీ అదుపుతప్పి రోడ్డు డివైడర్‌పైకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ట్రాలీ ముందుభాగం దెబ్బతింది. ఎస్‌హెచ్‌ఏఐ సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ట్రాలీని పక్కకు తీయించారు. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని గండేపల్లి పోలీసులు తెలిపారు.

టైరు పేలి మోటారు సైకిల్‌ను ఢీకొట్టిన కారు

గండేపల్లి: కారు టైరు పేలి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. రోడ్ సేఫ్టీ సిబ్బంది, స్థానికుల కథనం మేరకు హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళుతున్న కారు టైరు మండలంలోని జెడ్.రాగంపేట వద్ద పేలింది. దీంతో కారు అదుపుతప్పి ముందు వెళుతున్న మోటార్ సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై వెళుతున్న తాళ్లూరుకు చెందిన టి.శివ కుమార్, కిరణ్ గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వారిని రోడ్డు సేఫ్టీ వాహనంలో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న వంశీ కృష్ణ, మరో ఇద్దరు మహిళలు, చిన్న పాపకు ఎటువంటి గాయాలు కాలేదన్నారు. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని గండేపల్లి పోలీసులు తెలిపారు.